విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు

హస్తినాపురం: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ అధ్యాపకుల వేతనాలకే సరిపోవడం లేదన్నారు. సమావేశంలో బొట్టు రమేశ్, చేపూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత లేని బడ్జెట్

నాగోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ చేనేతకు చేయూత లేని బడ్జెట్ అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుస్సా యాదగిరి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నూతన సంస్కరణలు, పారిశ్రామిక విధానం వల్ల చేనేత మనుగడ అత్యంత సవాళ్లతో కూడుకుందన్నారు. అలాంటి రంగానికి సరిపడు బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. జీఎస్టీ రూపంలో ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయలు సమకూరుస్తున్నా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ



ఫలహారబండి ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు

మన్సూరాబాద్: దుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని పోచమ్మతల్లికి శుక్రవారం రాత్రి పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమంగా ఘనంగా జరిగింది. పోతరాజుల విన్యాసాలతో ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమం దుర్గాదేవి ఆలయం నుంచి పోచమ్మ దేవాలయం వరకు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రవి, మురళీ, రమణమూర్తి, రమేష్, అజయ్, కృష్ణమూర్తి, అశోక్, సత్తిరెడ్డి, అర్చకులు బాలమురళీకృష్ణశర్మ పాల్గొన్నారు.

ఘనంగా కాటమయ్య బోనాలు

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లో కంఠమేశ్వరస్వామి బోనాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాతూర శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు విఠల్‌రెడ్డి, లక్ష్మీప్రసన్నగౌడ్, అఖిల భారత గౌడసంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేములయ్యగౌడ్, పోచమ్మ దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి శంకరయ్య పాల్గొన్నారు.

రక్షణకు చర్యలు తీసుకోవాలి



హాస్టల్ బాలికలతో మాట్లాడుతున్న సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి

సైదాబాద్: మలక్‌పేట బీ బ్లాక్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ అంధబాలికల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న బాలికల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆమె సైదాబాద్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి అంధబాలికల వసతి గృహాన్ని సందర్శించారు. బాలికలతో మాట్లాడి హాస్టల్‌లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్‌కు సెక్యూరిటీ గార్డును నియమించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఠాకూర్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



ఎల్ఓసీని అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మణిపురి కాలనీకి చెందిన విమలకు శనివారం రూ.75 వేల ఎల్ఓసీని అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

హైదరాబాద్ మహానగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం పట్ల జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారీగా నిధులు కేటాయించినందుకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తాను మరణించి ముగ్గురి జీవితాల్లో వెలుగులు



రాజా (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ ప్రయివేట్ ఉద్యోగి. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ బృందావన్‌నగర్, భూదేవినగర్‌కాలనీకి చెందిన అందంకి రాజా (24) ఈ నెల 19 తన బైకుపై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. కుటుంబీకులు రాజాను ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఐసీయూలో చికిత్స అందించారు. ఈ నెల 26న బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు రాజా తల్లి ఆదిలక్ష్మి, సోదరుడికి అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో రాజా లివర్, రెండు కిడ్నీలను జీవన్‌ధాన్ సంస్థకు దానం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గోపాల్ (ఫైల్)

మలక్‌పేట: అనుమానాస్పద స్థితిలో హోటల్ వర్కర్ మృతి చెందాడు. ఈ ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేష్ వివరాల ప్రకారం .. మూసారంబాగ్ చౌరస్తాలోని స్టార్‌కేఫ్ హోటల్‌లో వరంగల్‌కు చెందిన వి.గోపాల్(50) మూడు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. అతనితో పాటు ఉన్న మరో వర్కర్ లేచి చూసేసరికి నోటి నుంచి నురుగు కక్కి గోపాల్ అచేతనంగా పడి ఉన్నాడు. హోటల్ యజమాని సల్మాన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సల్మాన్ వచ్చి చూసే సరికి గోపాల్ అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సల్మాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఆలయాల ముస్తాబు



మాతామైదాన్‌లోని శ్రీవిజయదుర్గామాతా ఆలయం

- బోనాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- విద్యుత్ దీపాలతో ఆలయాల అలంకరణ
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌లోని పలు డివిజన్లలో ఆదివారం జరుగనున్న ఆషాఢ బోనాలకు ఆలయాలను ముస్తాబు చేశారు. అధికారులు, నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ కాంతులతో, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. చెత్తను తరలించే విధంగా శానిటేషన్ విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. దేవాలయాల వద్ద ఉన్న రోడ్లలో గుంతలు లేకుండా మరమ్మతులు చేశారు.

మన్సూరాబాద్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బోనాలు. అమ్మవారి ప్రేమాకటాక్షం కుటుంబంపై చల్లగా ఉండాలని బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఆషాఢ మాసం తొలి ఆదివారంలో ప్రారంభమయ్యే బోనాలు చివరి ఆదివారంతో ముగుస్తాయి. మన్సూరాబాద్‌లోని శుభోదయకాలనీలో విజయదుర్గ దేవాలయం, జడ్జెస్ కాలనీలో నల్లపోచమ్మ, గ్రామంలోని చిత్తారమ్మ, పెద్దచెరువు కట్టపై కట్టమైసమ్మ దేవాలయాలను బోనాల ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ప్రధాన దేవాలయం పోచమ్మగుడిలో బోనాల ఉత్సవాలకు ఆలయాన్ని సుందరీకరణ చేసి అందంగా అలంకరించారు. అమ్మవారి ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చంపాపేట డివిజన్‌లో..

చంపాపేట: డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్, చంపాపేట, దుర్గానగర్, శుభోదయ, పోచమ్మగడ్డ పోచమ్మ, నల్ల, ఎర్ర పోచమ్మ ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతాయరు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని వసతులను ఏర్పాటు చేశారు.



పోచమ్మదేవి అమ్మవారు

సైదాబాద్: ఆషాఢ మాస బోనాల మహోత్సవాలకు సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్‌ల పరిధిలోని అమ్మవారి దేవాలయాలు ముస్తాబయ్యాయి. ఆయా కాలనీలు, బస్తీలలోని ఆలయాలను కమిటీ ప్రతినిధులు సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేయించారు. సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గా మాతా ఆలయం, జీవన్‌జ్యోతిలోని జయదుర్గా ఆలయం, సైదాబాద్ పెద్దతోటలోని వాగామ్రి మాతా ఆలయం, మాతృశ్రీ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం, ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని విష్ణునగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం, నాగులమ్మ దేవాలయాలను బోనాల ఉత్సవాల కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



మన్సూరాబాద్‌లోని పోచమ్మ దేవాలయం ముందు ఏర్పాటు చేసిన సెట్టింగ్

బారికేడ్ల తొలగింపుతో తీరిన కష్టాలు



మల్‌రెడ్డి రాంరెడ్డిని సత్కరిస్తున్న ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద బారికేడ్ల తొలగింపుతో వ్యాపారులకు మేలు జరుగుతుందని తెలంగాణ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న లలితానగర్ వద్ద మెట్రో బారికేడ్లు ఉండటం వల్ల వ్యాపారాలు సాగడం లేదని ట్రేడర్స్ అసోసియేషన్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించడంతో బారికేడ్లు తొలగించాలని ఆదేశించారు. దీంతో శనివారం బారికేడ్లను తొలగించి లలితానగర్ వద్ద నిర్మించిన రోడ్డును మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రారంభించారు. నూతనంగా వేసిన రహదారికి మల్‌రెడ్డి రాంరెడ్డి మార్గ్‌గా నామకరణం చేసినట్లు ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం రాంరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ట్రేడర్స్ శ్రీను, విజయ్, లలిత్, కాంగ్రెస్ నాయకులు మంజులరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

నేడు ప్రొఫెసర్ జయశంకర్ స్మారకోపన్యాసం



పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు

నాగోలు: బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో 'సమకాలీన భారతీయ సమాజం- ముందున్న సవాళ్లు' ఆదివారం జరిగే ప్రొఫెసర్ జయశంకర్ సార్ 13వ స్మారకోపన్యాసం సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. శనివారం కొత్తపేటలో ప్రొ. జయశంకర్ 13వ స్మారకోపన్యాసం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ది వైర్ పత్రిక సీనియర్ ఎడిటర్ అర్ఫా ఖానుమ్ శర్వాణి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంకుష్ చరణ్, ప్రొఫెసర్ ఉపేందర్, కేవీఎల్, పల్లె వినయ్, నగేష్ అప్ప, తిప్పర్తి మహేష్, ప్రముఖ సినీగేయ రచయిత అభి ఉప్పల్, జినికుంట్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో విద్యుత్ దీపాలు అందజేత

హస్తినాపురం: బోనాల పండుగ సందర్భంగా వివిధ కాలనీల్లో అవరసమైన చోట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ దీపాలను శనివారం పంపిణీ చేశారు. ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో లైట్లను అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ జగన్నాథం, ఏఈ హేమూనాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరి, హనుమాన్‌నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్

ఎల్‌బీనగర్: వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది లేకండా సిబ్బంది, అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. జోనల్ పరిధిలోని 5 సర్కిళ్ల శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులతో శనివారం జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్కిళ్లలో ఉన్న ప్రధాన సమస్యలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై ఎక్కడ కూడా నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం ముగిసే వరకు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లను ఎక్కడ కూడా తవ్వవద్దని, అనుమతులు లేకుండా రోడ్లను తవ్విన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ రమేష్‌బాబు, సీఆర్ఎంపీ అధికారులు, శానిటేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాట రూ. 30, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 38, బీర రూ. 35, క్యాబేజి రూ. 19, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 35, దొండ రూ. 28, చిక్కుడు రూ. 65, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 40, ఆలు రూ. 40, దోసకాయ రూ.15, సొరకాయ రూ. 9, పొట్లకాయ రూ. 13, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 40.

గమనిక: ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

డీసీసీ మాజీ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్ మృతి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



భిక్షపతిగౌడ్

నాగోలు: డీసీసీ మాజీ అధ్యక్షుడు, కొత్తపేట మాజీ సర్పంచ్ లింగాల భిక్షపతి గౌడ్(78) శనివారం మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, కొత్తపేట గ్రామం సర్పంచ్‌గా భిక్షపతి గౌడ్ ఉత్తమ సేవలు అందించారు. మృతదేహాన్ని నాగోలు కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై నివాళులర్పించారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కల్లుగీత కార్మిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, మాజీ కౌన్సిలర్ యాదగిరిరెడ్డి, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ తదితరులు నివాళులర్పించారు.

నేడు మహంకాళి ఆలయ బోనాలు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం బోనాల పండుగను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అంజన్‌కుమార్‌గౌడ్ శనివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అదేవిధంగా ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలోని కొండపోచమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సంరెడ్డి భుజంగరెడ్డి తెలిపారు.

శాకంబరిగా అమ్మవారు

చంపాపేట: చంపాపేట డివిజన్ గాయత్రీనగర్ చౌరస్తాలోని నాగార్జున ది నెస్ట్ జెన్ ఉన్నత పాఠశాలలో శనివారం శాకంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల కూరగాయలతో అలంకరించిన అమ్మవారి రూపం ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారికి నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మడి విఠల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, రూప, సరిత, మాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ దేవాలయంలో జరిగే బోనాల ఏర్పాట్లను శనివారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పరిశీలించారు. ఆదివారం జరిగే బోనాలకు రాష్ట్ర మంత్రి సీతక్క హాజరవుతున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ శేఖర్, ఉమారాణి, భాగ్యలక్ష్మి, దేవాలయ కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వీవీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హస్తినాపురం జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, పద్మానాయక్, డివిజన్‌ల అధ్యక్షులు చింతల రవి కుమార్, జక్కిడి మాల్లారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, స్థానిక బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు. అదేవిధంగా చైతన్యపురిలో భారీ కేక్ కట్ చేశారు. మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్ పాల్గొన్నారు. చంపాపేటలో బీఆర్ఎస్ నాయకుడు ఇంజమూరి రాఘవాచారి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

మన్సూరాబాద్: కొత్తపేట ఇసుక లారీ అసోసియేషన్ అధ్యక్షుడు నర్రి వెంకన్న ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని ఇసుక లారీ అడ్డ వద్ద కేక్‌ను కట్ చేసి మొక్కలు నాటారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

నాగోలు: బండ్లగూడ ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ నాయకులు నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతుల రాజిరెడ్డి, నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, చెర్కు ప్రశాంత్‌గౌడ్, చెర్కు జంగయ్య, తూర్పాటి సతీష్, కాటపాక రవి, రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ముక్కలు చేసేందుకు కుట్రలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగాన్ని ముక్కలు చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత మస్కు నర్సింహ్మా వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మతం- మతోన్మాదంపై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం మతోన్మాదం పెరిగిపోయిందన్నారు. మతం వేరు, మతోన్మాదం వేరని వివరించారు. మతం వ్యక్తిగత విషయమని, దీన్ని వ్యతిరేకించడం లేదని స్పష్టం చేశారు. దేశ విచ్ఛిన్నానికి కారణమయ్యే మతోన్మాదాన్ని ఉపేక్షించకూడదన్నారు. పేదల పక్షాన అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, మస్కు నర్సింహ సతీమణి అరుణ, పార్టీ నేతలు సామేల్, రామచంద్రయ్య, బుగ్గరాములు, కవిత, యాదయ్య, జగన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు